## క్లుప్తంగా

### పరిశీలన



వసతిగృహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

**పూసపాటిరేగ:** పూసపాటిరేగ మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ, కళాశాల వసతిగృహాలను ఎమ్మెల్యే లోకం నాగమాధవి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహాల నిర్వహణ అధ్వానంగా ఉండడంపై వార్డెన్ శరణ్మికిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నదీ, లేనిదీ ఆరా తీశారు. నిర్వహణ మెరుగుపరచకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమెతో పాఠశాల హెచ్ఎం బి. శంకరరావు, తదితరులున్నారు.

### పరామర్శ..



దుర్గారావుతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు

**నెల్లిమర్ల రూరల్:** మండలంలోని దన్నానపేటలో ఎంపీటీసీ సభ్యురాలు తర్లాడ జయమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు తర్లాడ దుర్గారావు కుటుంబాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు సోమవారం పరామర్శించారు. దుర్గారావు తండ్రి రామన్న ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు గ్రామానికి చేరుకొని దుర్గారావు కుటుంబ సభ్యులను ఓదార్చారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ మాణిక్యం నాయుడు

**విజయనగరం అర్బన్:** ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం రూపొందించిన గణిత క్యాలెండర్‌ను సోమవారం స్థానిక డీఈఓ కార్యాలయంలో డీఈఓ యూ.మాణిక్యంనాయుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర గౌరవ సలహాదారులు సిద్ధాంతం త్రినాథరావు, జిల్లా అధ్యక్షుడు వాక చిన్నంనాయుడు, ప్రతినిధులు జీవీబీఎస్ఎస్ రాజు, ఎస్ఈ శర్మ, ఐ.వెంకటరావు, సుబ్రహ్మణ్యం, గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

### నెల్లిమర్ల జూట్ మిల్లును తెరిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

**నెల్లిమర్ల:** నెల్లిమర్ల జూట్‌మిల్లును తక్షణమే తెరిపించాలని శ్రామిక సంఘ అధ్యక్షుడు చిక్కాల గోవిందరావు డిమాండ్ చేశారు. జూట్‌మిల్లు సమీపంలోని పాత పోస్టాఫీసు వద్ద శ్రామిక సంఘ జనరల్ బాడీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మిల్లు తెరిపించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో బేతా అప్పారావు, సముద్రపు సత్యనారాయణ, రెడ్డి సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

### భోగారావుకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న భోగారావు

**విజయనగరం అర్బన్:** పట్టణానికి చెందిన సాహితీవేత్త పప్పు భోగారావుకు విశాఖ తటవర్తి భారతి స్మారక సాహితీ పురస్కారం-2024 లభించింది. విశాఖలో సోమవారం జరిగిన కార్యక్రమంలో సెంచూరియన్ విశ్వవిద్యాలయ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎస్ రాజు చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఈ మేరకు భోగారావును పలువురు అభినందించారు.

# ఆరంభ శూరత్వమే..

- రెవెన్యూ సదస్సులకు స్పందన కరువు
- ఇప్పటివరకు వచ్చిన వినతులు 293
- పరిష్కారానికి నోచుకున్నవి 57 మాత్రమే
- ఇదీ సదస్సుల పరిస్థితి



చెల్లూరులో సదస్సులో రైతుల నుంచి అర్జీలు తీసుకుంటున్న ఆర్ఐ



అర్జీదారులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

**విజయనగరం రూరల్:** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల తీరు ఆరంభశూరత్వంగా మారింది. సదస్సులకు కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే హాజరైనప్పుడు మాత్రం అధికారులు, రైతులు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు. వారు హాజరుకాని సభలకు మాత్రం ప్రజలు పెద్దగా హాజరుకావడం లేదు. దీంతో అధికారులు తూతూమంత్రంగా నిర్వహిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. గడిచిన ఐదు సభల నుంచి మండల స్థాయి అధికారి కూడా హాజరుకాకుండా కేవలం రెవెన్యూ ఇనెస్పెక్టర్‌తోనే కార్యక్రమాన్ని కానిచ్చేస్తున్నారు. మండల స్థాయి అధికారి హాజరైతే కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం లభిస్తుందని రైతుల నమ్మకం.

**సదస్సు ముఖ్య ఉద్దేశం ఏమిటి..?**

వెబ్‌ల్యాండ్ నమోదు, భూముల రీసర్వే, రేషన్ కార్డులు మంజూరు, సరిహద్దు సమస్యలు, గ్రామ కంఠం, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఫిర్యాదులు వస్తే పరిష్కరిస్తారు. అలాగే అడంగల్, దేవదాయ భూముల సమస్యలు, కుల ధ్రువీకరణ పత్రాల మంజూరు, డిజిటల్ సంతకాలు, ఫ్యామిలీ సర్టిఫికెట్, మ్యుటేషన్, భూ సంబంధిత సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించడమే ప్రభుత్వ ఉద్దేశం. అయితే సదస్సుల నిర్వహణ తీరు అధ్వానంగా ఉండడంతో ప్రజల నుంచి పెద్దగా స్పందన రావడం లేదు. కేవలం కుల, ఆదాయ ధ్రువపత్రాల మంజూరు చేయడం తప్ప.. మిగిలిన సమస్యలను పరిష్కరించకపోవడంతో అర్జీదారులు పెద్దగా పట్టించుకోవడం లేదనేది సమాచారం.

**మండలంలో ఇదీ పరిస్థితి..**

మండలంలోని 24 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పక్కాగా నిర్వహించాలని రెవెన్యూ అధికారుల ప్రణాళిక. అయితే ఇప్పటివరకు 22 గ్రామాల్లో సదస్సులు నిర్వహించగా 1250 మంది హాజరుకాగా 293 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో కేవలం 57మాత్రమే పరిష్కారానికి నోచుకున్నాయి. ఇంకా కొండకరకాం, కేఎల్‌పురం గ్రామాల్లో సదస్సులు నిర్వహించాల్సి ఉంది. ఈ సదస్సులకైనా రెవెన్యూ, దేవదాయ, రిజిస్ట్రార్ శాఖాధికారులు హాజరవుతారో.. లేదో.. చూడాలి మరి.

**చెల్లూరులో అర్జీదారులు లేక వెలవెల..**

మండలంలోని చెల్లూరు గ్రామ సచివాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సు అర్జీదారులు లేక సదస్సు వెలవెలబోయింది. మధ్యాహ్నం రెండు గంటల సమయానికి కేవలం ఆరు దరఖాస్తులు మాత్రమే వచ్చినట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన భూముల రీసర్వే రైతులకు ఎంతో సంతృప్తి ఇచ్చినట్లు స్వయంగా వారే సదస్సులో చెబుతున్నారు. మళ్లీ రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి ఈ కూటమి ప్రభుత్వం ఏం సాధిస్తుందని పలువురు మండిపడుతున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదినారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు

## జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పతకాలు



విజేతలను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు

**విజయనగరం అర్బన్:** పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని ఖరగ్‌పూర్‌లో ఇటీవల జరిగిన 24వ జాతీయ జపాన్ కెన్యూర్యూ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో పట్టణానికి చెందిన సత్య డిగ్రీ, పీజీ కళాశాల కరాటే క్రీడాకారులు ఐదుగురు వివిధ విభాగాల్లో పతకాలు సాధించారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీసాయిదేవ మణి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌జూనియర్ విభాగంలో పి.హేమంత్ (కాటా, కుమిటి కేటగిరిల్లో బంగారు పతకాలు), పి.కుశ్వంత్ కుమార్ (కాటాలో బంగారు, కుమిటిలో రజతం), కె.శివగణేష్ (కాటాలో బంగారు, కుమిటిలో కాంస్యం), ఎం.హర్షవర్ధన్ (కాటా, కుమిటీలో రెండు రజత పతకాలు) సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీసాయిదేవమణి క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్లు కెప్టెన్ ఎంసత్యవేణి, లెఫ్టినెంట్ ఎం.ఉదయ్‌కిరణ్, ఎస్ఎస్ఎస్ ఆఫీసర్ బి.సూరప్పనాయుడు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎస్‌హెచ్‌ప్రసాద్ పాల్గొని విజేతలను అభినందించారు.

## రోల్డ్ గోల్డ్ నగలు చోరీ

**విజయనగరం క్రైమ్:** ఇంట్లో చొరబడి బీరువాలు పగులగొట్టి బంగారం అనుకుని రోల్డ్‌గోల్డ్ నగలు చోరీ చేసిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ సోమవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక కంటోన్మెంట్ ఎల్‌బీ కాలనీకి చెందిన ఎస్.సురేష్ ఈ నెల 29న సాయంత్రం రాకోడులో ఉన్న బంధువుల ఇంటికి కుటుంబంతో కలిసి వెళ్లాడు. మరుచటి రోజు ఉదయం పక్కింటివాళ్లు ఫోన్ చేసి ఇంటి వెనుక తలుపులు తెరిచి ఉన్నాయని చెప్పడంతో 9 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు తీసి ఉన్నాయి. హాల్, బెడ్‌రూమ్‌లో ఉన్న రెండు బీరువాలు విరగ్గొట్టి చిందరవందరగా ఉన్నాయని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అయితే బీరువాలో ఉన్న రోల్డ్ గోల్డ్ ఆభరణాలను బంగారం అనుకుని దొంగ పట్టుకుపోయాడని, పిల్లల హుండీలో ఉన్న రూ. 350 చిల్లరడబ్బులు తీసుకెళ్లిపోయాడన్నారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



## సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

- ఎమ్మెల్యే లోకం నాగమాధవి



భోగాపురం: విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి



డెంకాడ: ప్రాజెక్టులను తిలకిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

**భోగాపురం:** మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఎంఈఓ బాలిపల్లి చంద్రమౌళి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన దక్షిణ భారత వైజ్ఞానిక ఎగ్జిబిషన్ సదస్సులో విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టులను ఎమ్మెల్యే నాగమాధవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న మేధోసంపత్తిని వెలికి తీసేందుకు ఈ తరహా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. నైతిక విలువలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ పెంపొందించుకోవాలన్నారు. ప్రతి విద్యార్థీ నాయకత్వ లక్షణాలను అలవర్చుకుని, ప్రతి అంశాన్నీ సానుకూల దృక్పథంతో చూడాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్ పార్వతి మాట్లాడుతూ.. ఈ వైజ్ఞానిక ఎగ్జిబిషన్‌లో మండలంలోని 11 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలు, 6 ప్రాథమిక పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని పలు ప్రాజెక్టులు తయారు చేశారన్నారు. వీటిలో 32 ప్రాజెక్టులను ఎంపిక చేసి జిల్లా స్థాయి ప్రదర్శనకు పంపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

**విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలతో సృజనాత్మకత..**

**డెంకాడ:** విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికతీయవచ్చని వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, ఎంపీడీఓ భవానీ అన్నారు. మండలంలోని పినతాడివాడ ప్రాథమికోన్నత పాఠశాలలో దక్షణ భారతదేశ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు మండల స్థాయిలో జరిగాయి. ఈ ప్రదర్శనలో పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎనిమిది విభాగాల్లో ప్రాజెక్టులు ప్రదర్శించారు. వ్యక్తిగత ప్రాజెక్టుల విభాగంలో కేజీబీవీ విద్యార్థిని పి.కీర్తి.. సమూహ విభాగంలో రఘుమండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎ.సాయి, ఓ.గిరిధర్ ప్రతిభ కనబరిచారు.మ అలాగే ఉపాధ్యాయ విభాగంలో రఘుమండ ఉన్నత పాఠశాలకు చెందిన బి.దిలీప్‌కుమార్.. క్విజ్ విభాగంలో రఘుమండ ఉన్నత పాఠశాలకు చెందిన పి.మల్లీశ్వరిదేవి విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ఎంఈఓ వి.శ్రీరాము, సర్పంచ్ లెంక లక్ష్మణరావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

**సృజనాత్మకతను వెలికితీయాలి..**

**నెల్లిమర్ల:** విజ్ఞాన ప్రదర్శనలతో విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలికితీయవచ్చని ఎంఈఓలు యు. సూర్యనారాయణమూర్తి, ఈపు విజయ్‌కుమార్ అన్నారు. నెల్లిమర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మండల స్థాయి విజ్ఞాన ప్రదర్శనను సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు జనవరి 3న నిర్వహించనున్న జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

## అంబేడ్కర్‌ను అవహేళన చేయడం తగదు

- సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ

**భోగాపురం:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవహేళన చేసి మాట్లాడడం తగదని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బి. సూర్యనారాయణ అన్నారు. నవ భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి అయిన బీఆర్ అంబేడ్కర్‌ను కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షా దూషించి మాట్లాడడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ముక్కాం సెంటర్ వద్ద సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ.. ఇటీవల ఢిల్లీలో జరిగిన రాజ్యసభ సమావేశాల్లో హోమ్ మంత్రి అమిత్‌షా దేశ ప్రజలందరూ అంబేడ్కర్ పేరును స్మరిస్తున్నారని... దానికి బదులు దేవుడి పేరును స్మరిస్తే స్వర్గానికి వెళ్లవచ్చని అవహేళనగా మాట్లాడారన్నారు. ప్రజాస్వామ్యాన్ని, లౌకిక విధానాన్ని, సమైక్య వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ఈ దేశంలో ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఈ దేశ ప్రజానీకానికి భగవంతుని రూపంలో అవతరించిన ఒక మహోన్నతమైన శక్తి అంబేడ్కర్ అని.. ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ అంగీకరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అప్పారావు, వాసు, రాము, తదితరులు పాల్గొన్నారు.

## నూతన లబ్ధిదారులకు పింఛన్ల అందజేత

**విజయనగరం రూరల్:** కొత్తగా మంజూరైన పింఛన్లను ఎంపీపీ మామిడి అప్పలనాయుడు లబ్ధిదారులకు అందజేశారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ మందిరంలో నలుగురు లబ్ధిదారులకు వితంతు పింఛన్ల అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ తిరుపతినాయుడు మాట్లాడుతూ.. గుంకలాం గ్రామానికి చెందిన బలగం రాములమ్మ, గొల్లలపేటకు చెందిన ఆవాల పైడమ్మ, రాకోడు గ్రామానికి చెందిన గడివాడ రామలక్ష్మి, సారిక గ్రామానికి చెందిన చెలికి జోగులమ్మకు వితంతు పింఛన్లు మంజూరయ్యాయన్నారు. వీరందరికి ఎంపీపీ చేతుల మీదుగా నగదు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ రవిబాబు ఉన్నారు.

## సచివాలయాల్లో షెడ్యూల్డ్ కులాల ఆడిట్ వివరాలు

**విజయనగరం:** నగరంలోని అన్ని సచివాలయాలలో షెడ్యూల్డ్ కులాల సోషల్ ఆడిట్ వివరాలను పొందుపరుస్తున్నారు. వాటిలో అభ్యంతరాలుంటే జనవరి 6వ తేదీ లోగా తెలియజేయవచ్చని కార్పొరేషన్ అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అన్ని సచివాలయాలలో షెడ్యూల్డ్ కులాల సోషల్ ఆడిట్ వివరాలను నోటీస్‌బోర్డులో పొందుపరిచారు. అభ్యంతరాలు, సలహాలను సచివాలయ రెవెన్యూ కార్యదర్శికి తెలియజేస్తే.. పరిశీలించి సరిచేస్తామన్నారు.

## వ్యాపారులకు ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరి

**విజయనగరం:** వ్యాపారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్‌లు విధిగా తీసుకోవాలని కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగం అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు ఇప్పటివరకు ట్రేడ్ లైసెన్సులు పొందని వ్యాపారుల దగ్గరకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. బాలాజీ టెక్స్‌టైల్ మార్కెట్‌లో వివిధ దుకాణాల వద్దకు వెళ్లి సోమవారం అవగాహన కల్పించారు. లైసెన్స్ ఫీజులు భారీగా తగ్గించామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బాలకృష్ణ, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## 19 ఫిర్యాదుల స్వీకరణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

**విజయనగరం క్రైమ్:** ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 19 వినతులు స్వీకరించారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ సీఐ ఎస్.శంకరరావు, ఎస్‌బీ సీఐ ఎ.లీలారావు, ఆర్‌వీఆర్‌కే.చౌదరి, ఎస్సై రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# వనంగుడిలో చండీయాగం..



యాగంలో పాల్గొన్న భక్తులు

**విజయనగరం టౌన్:** ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారికి మూలానక్షత్రం పురస్కరించుకుని స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో సోమవారం చండీయాగం నిర్వహించారు. వేదపండితులు తాతా రాజేష్ యాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## వృద్ధులకు సేవ చేయడం పూర్వజన్మ సుకృతం

- వృద్ధాశ్రమం అధ్యక్షుడు సన్యాసినాయుడు



ఆశ్రమ వార్షికోత్సవంలో నిర్వాహకులు, వృద్ధులు

**విజయనగరం రూరల్:** మండలంలోని పినవేమలిలో ఏర్పాటు చేసిన వృద్ధాశ్రమం అందరి సహకారంతో 12 వసంతాలు పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉందని.. వృద్ధులకు సేవ చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు ఆశ్రమ అధ్యక్షుడు ఎ.సన్యాసినాయుడు అన్నారు. ఆశ్రమ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో వృద్ధాశ్రమాలు పెరగడం బాధకరమన్నారు. కని, పెంచిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో ఆదరించని పిల్లలను చూసి సమాజం సిగ్గపడుతోందన్నారు. ఆశ్రమ ఉపాధ్యక్షుడు అప్పలనాయుడు మాట్లాడుతూ.. ఆశ్రమంలో 26 మంది వృద్ధులకు ఆశ్రయం కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులతో సమస్యల పరిష్కారం


- తహసీల్దార్ గోవింద

**పూసపాటిరేగ:** రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ తాడ్డి గోవింద అన్నారు. మండలంలోని నడిపల్లిలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు భూ సంబంధిత సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. రెవెన్యూ సేవలకు ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదన్నారు. జిరాయితీ భూములు ఆక్రమణకు గురైనట్లయితే బాధితులకు అండగా నిలిచి పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్వేయర్ గణపతిరావు, సర్పంచ్ లంకలపల్లి గాయత్రి, ప్రజాప్రతినిధి లంకలపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

**రెండు గ్రామాల్లో..**

**నెల్లిమర్ల రూరల్:** మండలంలోని మొయిద విజయరామపురం, పూతికపేట గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ సుదర్శనరావు రైతుల వద్ద నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గుంటమాని ఉమ, అట్టాడ కృష్ణ, ఆర్. వేణుగోపాలరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## బాలుడిని పట్టుకున్న పోలీసులు



పట్టుకున్న బాలుడు నందకిశోర్‌తో ఎస్సై సన్యాసినాయుడు తదితరులు

**డెంకాడ:** ఈనెల 8వ తేదీ నుంచి కనపించకుండా పోయిన ఎస్.నందకిషోర్ అనే బాలుడిని విశాఖపట్నంలో పట్టుకుని బాలుడి తండ్రి పాపునాయుడికి అప్పగించినట్లు ఎస్సై ఎ.సన్యాసినాయుడు సోమవారం తెలిపారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. డెంకాడ మండలంలోని బొడ్డవలస పంచాయతీ గెద్దవానిపాలెం గ్రామానికి చెందిన నందకిషోర్(14) ఈనెల 8వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో బాలుడి తండ్రి పాపునాయుడు డెంకాడ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. భోగాపురం సీఐ రామకృష్ణ, డెంకాడ ఎస్సై సన్యాసినాయుడు, సిబ్బంది బాలుడి ఆచూకీ తెలుసుకునే పనిలో భాగంగా వివిధ మార్గాలను అన్వేషించారు. ఆదివారం రాత్రి పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు ఎస్సై సన్యాసినాయుడు, కానిస్టేబుల్ దామోదర్ విశాఖపట్నంలోని గాజువాక దగ్గరలో ఉన్న ఆర్‌కే డార్మిటరీ వద్ద బాలుడిని పట్టుకున్నారు.